# మహర్షి

కెప్టెన్ షేక్ మౌలాలీ

జీవనగమనంలో ఎందరెందరితోనో పరిచయం ఏర్పడుతుంది. కొందర్ని మరుక్షణంలో మర్చిపోతాం. కాని మరికొందరి పరిచయం సాన్నిహిత్యంగా మారి అత్యంత ఆత్మీయతకు దారి తీస్తుంది.

పై వానిలో రెండవ కోవకు చెందిందే రఘుతో నా బాంధవ్యం. ఇద్దరం ఒకే కాలేజిలో లెక్చరర్లం కావడం మా స్నేహానికి మరికొంత దోహదం చేసింది. నేను రఘు కంటె వయస్సులో నాలుగేళ్ళు పెద్ద.

ఒక ఆదివారం ఉదయం పది గంటల ప్రాంతంలో "మాష్టారూ! మీకు ఇంట్లో ఏదైనా పనుందా! అనడిగాడు రఘు వచ్చి.

"ఏం!" అన్నట్లు చూశాను.

"స్కూటరుమీద ఎక్కండి. ఆశ్రమం దగ్గరకు వెళ్ళి వద్దాం!" అన్నాడు.

ఆశ్చర్యంగా అతని ముఖంలోకి చూశాను.

రఘు నా ముఖ కవళికలు గ్రహించాడు.

"ముందు చొక్కా వేసుకు రండి! వివరాలు మీకే తెలుస్తాయి!" అన్నాడు.

చదువుతున్న రామాయణం లోన అలమరలో పెట్టి వచ్చాను.

స్కూటర్ స్టార్ట్ చేసి "వెనుక కూర్చోండి!" అన్నాడు ప్రశాంతంగ.

ప్రకృతి శోభ పర్చుకున్న ప్రశాంత వాతావరణంలోని ఒక లతా వితానం క్రింద చిన్న కుటీరం ముందు ఆగింది స్కూటరు.

లోపల నుండి కర్ర సహాయంతో ఒగుడాకులాగ గెంతుకుంటూ ఒక ముసలమ్మ బయటికి వచ్చింది. వృద్ధాప్యం కారణంగ పూర్తిగ వంగిపోయింది. జీవన అనుభవాలకు ఫలితంగా తల పూర్తిగ పండి మేరు శిఖరాగ్రంలాగ ధవళ కాంతితో మెరుస్తోంది.

మమ్మల్ని చూడగానే "రండయ్యా! రండి!" అంటూ బోసి నోటితో సాదరంగ ఆహ్వానించింది.

తాటి ఆకుల చాపలు రెండు పరిచింది. కూర్చున్నాం.

చుట్టూ కలియ చూశాను. ఆవు పేడతో అలికి చక్కగ ముగ్గులు పెట్టి వుంది. ఆగ్నేయంలో యజ్ఞకుండంలాగ ఒక చిన్న పొయ్యి ఉంది. అర డజను ఎయిర్ కండిషన్లు పెట్టినంత హాయిగా ఉందక్కడ. వివిధ పుష్ప సుగంధ పరిమళాలు నాసా పుటాలను జాగృతం చేస్తూ ఆహ్లాదాన్ని కలుగ చేస్తున్నాయి.

"ఆశ్రమాల్లో మహర్షుల తాపసిక శక్తి పుష్ప పరిమళాల రూపంలో వ్యక్తమౌతుందంటారు! ఇదేనేమో!" అనిపించింది నాకు.

"మంచి తీర్థం తీసుకో నాయనా!" అన్న మాటలతో నా ఆలోచనా సరళిలో నుండి తేరుకొని, గ్లాసు అందుకొని తాగాను. దివ్యంగ ఉంది.

"ఏమిటిది! చాల రుచిగా ఉందే!" అన్నాను.

"వట్టివేళ్ళు, సుగంధ పాల, తులసి, చెరకు, అల్లం, అతి మధురం, జీలకర్ర కొంచెంగా నూరి నీళ్ళలో కలిపి వడపోసి నిమ్మకాయ రసం, ఆవు పాలు, తేనె కలిపి త్రాగుతుంటాను. ఇది సర్వ తాపాలకు ఉపశమనం!" అంది.

"మరి భోజనం?" కుతూహలంగా అడిగాను.

"పెద్దగా ఆకలివేయదు. ఎప్పుడయినా అవసరమనిపిస్తే కాస్త ఉడకేసుకు తింటాను... సహజంగ అంత అవసరం రాదు... ఆశ్రమంలో సంవత్సరం పొడవునా రకరకాల పండ్లు కాస్తుంటాయి. వాటితోనే జీవనం నడుస్తుంది... అయ్యో మాటల్లోనే మరిచాను నాయనా! అంటూ ఒక తాటాకు బుట్టనూ ఎదురుగ్గా పెట్టి, తనూ కూర్చుంది.

జామ, సపోట, మామిడి ఒకొక్క పండుతీసి కొంగుతో తుడిచి మా చేతుల్లో పెట్టసాగింది. బాగ రుచిగా ఉంటం మూలాన కొంచెం ఎక్కువగనే తిన్నాం.

"ఇక చాలమ్మా!" అన్నాడు రఘు.

ముసలమ్మ ముఖంలో తృప్తి, ఆనందం తొంగిచూశాయి.

"ఈ అబ్బాయి!" అని నావైపు చూసింది.

"చెప్పటం మర్చానమ్మా! అప్పుడప్పుడు నీతో మాస్టరుగారని చెపుతుంటానే... ఆయన! మా కాలేజిలోనే పనిచేస్తున్నారు." అన్నాడు రఘు.

"నా కెందుకో ఈ రోజు చాల ఆనందంగ ఉంది బాబూ! ఇప్పుడే శబరి ఘట్టం చదివాను. రామలక్ష్మణులలాగ మీ రొచ్చారు. అంది.

"మేము రామలక్ష్మణుల మవటం వేరే విషయం... కాని నువ్వు మాత్రం శబరివేనమ్మా!" అన్నాను నేను.

స్మిత భావంతో నా వైపు చూసింది.

రఘు వాచివైపు చూసి "పన్నెండు కావస్తుందమ్మా!వస్తాము. డబ్బేమైనా కావాల్నా?" అన్నాడు.

"ప్రస్తుతం డబ్బులు వద్దు కాని, ఎండ బాగ కాస్తుంది. పొద్దు వాటాలాక వెళ్ళకూడదూ!" అంది.

"కాదమ్మా వెళ్తాం... వేరే పనులు కూడ ఉంటాయి కదా!" అన్నాడు రఘు.

"అయితే ఒక్క క్షణం ఆగండి!" అంటూ పొయ్యి రాజేసి, అరగంట తిరక్కుండ మా ముందు చెరో గ్లాసు పాయసంలాంటి పదార్థం ఉంచింది.

"ఏమిటిది?" అన్నాను.

"తమిదజావ! తాగండి! ఆకలికి, ఎండకూ రెండింటికి ఉపశమనం" అంది.

మధ్యాహ్నం రెండుగంటలయ్యేసరికి ఇల్లు చేరాము.

మార్గంలో రఘును నా భావనా 'శబరి' వివరాలడిగాను. అతను సరి అయిన సమాధానం ఇవ్వకుండ మాట దాటవేశాడు. చెప్పక పోవటానికి బహుశ ఏదైనా బలీయమైన కారణం ఉండవచ్చు ననుకొని సరిపెట్టుకున్నాను.

ఆనెలలో మరి రెండుసార్లు ఆమె దగ్గరకు వెళ్ళి వచ్చాము. తర్వాత వారం – పదిరోజులకు ఒకసారి వెళ్ళి ఆమె బాగోగులు విచారించి, ఆమెనుండి అతిథి సత్కార ఆశీర్వచనాలు పొందడం మావంతు అయింది. అన్నిటికంటె ఆమె నాలో వేసిన 'శబరి' ముద్ర చాల మహత్తరమైంది.

సందర్భం వచ్చినప్పుడల్లా రఘును ఆమెను గురించి అడిగాను. కాని ఫలితం శూన్యం. పోనీ, ఆమెనే అడుగుదామనుకుంటే బావుండదనిపించింది. అసలు అలాంటి కుతూహలం చూపెట్టడం సభ్యత, సంస్కారం కాదనిపించింది.

రఘుకు ఇతరులకు సహాయం చేయటం పరిపాటి. ఉదాహరణకు నేను చాలసార్లు డబ్బుకు కటకటలాడుతుంటాను. అతను తన తంటాలు తానుపడి ఆర్థికంగ అప్పు రూపంలో నన్ను ఆదుకున్న సందర్భాలు కొల్లలు. బహుశ ఈ ముసలమ్మ దూరపు బంధువో లేక అనాధో అయిఉంటుందని ఊహించాను. రఘు ఆపద్ధర్మంగ ఆమెను ఆదుకుంటున్నాడేమో! ఆ తర్వాత రఘును మరెన్నడూ ఆమె వివరాలకై ప్రశ్నించలేదు.

ఈ విధంగా నాలుగునెలలు – నాలుగు సంవత్సరాలు గడిచాయి.

ఆరోజు మకర సంక్రాంతి బ్రహ్మముహూర్తంలోనే లేచి గోదావరికి వెళ్లాను. స్నానం చేశాను. సంధ్యావందనం, ధ్యానం అయ్యాయి. మకర సంక్రమణం ఆరుగంటలకే కనుక, ఎనిమిదయ్యే సరికల్లా పితృదేవతలకు పిండప్రదానం చేశాను.

పూర్వం బ్రాహ్మణులకు సువర్ణ, రజిత, తామ్రాది వివిధ దానాలు చేసేవారు. అగ్రహారాలు యిచ్చేవారు. అనేక కారణాలవలన వాని స్థాయి పడిపోయింది. నేను స్వయంపాకం మాత్రం ఇచ్చుకోగలిగాను. మొత్తంమీద ఒక కూష్మాండం సంపాయించి దానం చేశాను. ఆ పుడమి వేలుపు మహదానంద పడ్డాడు.

ఇంటికి వచ్చి వసారాలో కూర్చున్నాను... ఏవేవో ఊహలు, భావనలు మదిలో మెదులుతున్నాయి. 'ఆత్మశక్తి' 'సూర్యశక్తి'కి ప్రతీక అనిపించింది. సూర్యుడు సంవత్సర కాలంలో పన్నెండు రాసులలో తిరుగుతూ, అన్ని రాసులను ప్రభావితం చేస్తుంటాడు. కాని ఆత్మ వివిధ యోనుల్లో జన్మించి, ఆ ఉపాధినే సేవిస్తుంది. ఏమిటీ ఈ విపరీతం?

అయితే ఉషస్సంధి లక్షణాలను పాటిస్తూ, ఆత్మదృష్టి కలిగి ఉండటంవల్లన తూ[illegible] మహర్షి అవుతాడనిపించింది.

హృషీకాణాం నిగ్రహణాత్
ఋషిరిత్యభి ధీయతే!

అన్న ఆర్యవాక్కు నా స్మృతిపథంలో మెదిలింది.

మాస్టారూ!" అన్న పిలుపుతో నా ఆలోచనా ప్రవాహానికి అంతరాయం కలిగింది.

"రండి, కూర్చోండి!" అంటూ రఘు ముఖంలోకి చూసి, ఏమిటి విశేషం!" అన్నాను.

"ఆశ్రమందాక వెళ్ళాలి.. త్వరగా..." నిర్లిప్తంగ అన్నాడు.

ఒక్క నిముషం!" అని లోపలికి వెళ్లాను. నేను చొక్కా తొడుక్కునే లోపల మా ఆవిడ ఒక చిన్న క్యారేజిలో పులిహోర, క్షీరాన్నం, గారెలు పెట్టి నా చేతికిచ్చింది

రఘు కనీసం కూర్చోకుండ అలాగే నిల్చున్నాడు. నా చేతిలో క్యారియర్ చూసి "ఏమిటది?" అన్నాడు.

చెప్పాను.

దయచేసి ఇప్పుడేం వద్దు. మనం త్వరగా వెళ్లాలి!" అంటూ నా చేతిలోంచి క్యారియర్ అందుకొని వరండాలో టీపాయ్ మీదపెట్టి స్కూటర్ స్టార్ట్ చేశాడు.

అరగంట వ్యవధిలో ఆశ్రమం చేరాం. కుటీరం ముందు ఆకులతో, గడ్డితో తయారు చేయబడిన శయ్యపై 'శబరి' భౌతికకాయం పరుండబెట్టి ఉంది.

ఆమె చనిపోలేదని! నా సందేహం. నాడి చూశాను. స్పందన లేదు!" తాపసికుల శరీరాలు ప్రాణం అనంతవాయువులో లీనమైపోయాక కూడ కొంతకాలం వరకు సజీవంగ ఉన్నట్లుంటాయి అంటారు! ఇదేనేమో!" అనుకున్నాను.

రఘు, నేను ఆమె పాదాలకు నమస్కరించాము.

రఘు ముఖంలోకి చూశాను.

ప్రశాంతంగ ఉన్నాడు.

'అంత్యక్రియలు...'

"నేను చేస్తాను!" అన్నాడు నామాటల అందుకుంటూ.

సంధ్యా సమయంలో ఆకాశమంతా తామ్రవర్ణం దాల్చింది, సూర్యుడు పశ్చిమ దిశలో జారిపోతున్న అగ్నిభాండంలా ఉన్నాడు.

పావన గోదావరి తీరంలో రఘు 'శబరి' చితికి నిప్పంటించాడు. అగ్నిదేవుడి సప్తజిహ్వాలలో ఆమె భౌతికకాయం లీనమైంది.

నేను, రఘు చితికి తూర్పు దిశలో నిల్చున్నాము. చితిజ్వాలలనుండి ఒక వ్యక్తావ్యక్త స్వరూపం బయలువెడలింది.

అలాగే చూస్తూ నిల్చున్నాము. పశ్చిమంగ ప్రయాణించి అస్తమించబోతున్న భాను బింబంలో లీనమైపోయింది. నా నోటినుండి అప్రయత్నంగ.

మన్మనాభవ మద్భక్తో
మద్యాజీ మాం నమస్కురు!
మామేవైష్యసి సత్యంతే
ప్రతి జానే ప్రియోసిమే!!

భగవద్వాణి వెడలింది.

రాత్రి పదకొండు గంటలకు రాజమండ్రి మార్గం పట్టాము. మధ్యలో స్కూటరు ఆపి రోడ్డు ప్రక్కన కూర్చొని రఘు వెక్కి – వెక్కి ఏడవసాగాడు.

"అరే! ఏమయింది రఘు ఎందుకి ఏడుపు" ఓదార్చబోయాను.

"వద్దు మాస్టారూ! నన్ను ఆపవద్దు! తృప్తిగా, తనివితీరా ఏడవనీయండి!" అన్నాడు రఘు.

నిజమే! సముద్ర గర్భంలోంచి బడబాగ్నిలో ఘర్షణ ఏర్పడినప్పుడు, కల్లోలితమై పెల్లుబికి తుఫాను వస్తుంది. తర్వాత కొంతకాలంలోనే సాగరంలో తిరిగి ప్రశాంతత ఏర్పడుతుంది. మానవ హృదయం కూడ అంతే! నవ్వు, ఏడుపు సుఖదుఃఖాల బహిర్ రూపాలు. వాటిని అణచటానికి ప్రయత్నిస్తే,



ఇంటర్ విద్యార్థులారా!
1957 లో స్థాపించిన
రవి కళాశాల
[బ్రాడీపేట, గుంటూరు]
ఎన్నో వేలమంది
ఇంజనీర్లను, డాక్టర్లను
తయారుచేసి
ఆంధ్రుల అభిమానం
చూరగొన్న సంస్థ.
ఇపుడు ఇంటర్,
Bi.P. M.P. గ్రూపులతో
చదివే వారి కోసం
రవి
పోస్టల్
ట్యూషన్
ట్యూషన్సు, గైడ్సు
అవసరం లేకుండా
ఇంటర్ పరీక్షలలోనే గాక
ఎంట్రన్సుపరీక్షలలోకూడా
నెగ్గటానికి ఎంతో
ఉపయోగపడుతుంది.
వివరాలకు రు. 5/-లు
పంపండి.
సి. వి. ఎన్. ధన్,
డైరక్టర్.

# మహర్షి

మానసిక చాంచల్యమేర్పడుతుంది.

ఏమాత్రం మాట్లాడకుండ రఘు ప్రక్కనే కూర్చున్నాను. నా చేతిని తన ఒళ్ళోకి లాక్కున్నాడు రఘు. రెండో చేత్తో నేనతని వీపు నిమిరాను.

"మీరు 'శబరి'గా ఊహించిన ముసలమ్మ నాకు దూరపు బంధువు కాదు, లేక 'అనాథ' కాదు మాస్టారూ! స్వయాన మా అమ్మ! లక్షల ఆస్తి ఉండి కూడ ఆమెను ఇంట్లో ఉంచి సేవ చేయలేకపోయాను" అన్నాడు.

నేనేమి మాట్లాడలేదు.

"నా భార్య చదువుకుంది. అన్ని విధాల ఉత్తమ ఇల్లాలు..... కాని పదేళ్ళ క్రిందట మా వివాహమయిన క్రొత్తలో అత్తా కోడళ్ళ మధ్య మాట పట్టింపు వచ్చింది. దానికి పెద్ద కారణమంటూ కూడ ఏమి లేదు. వెంటనే మా ఆవిడ వేరే కాపురం కోసం పట్టుబట్టింది. విచిత్రమేమిటంటే ఆ రోజుల్లోనే నాకు ఉద్యోగం వచ్చింది. కనుక ఇంటి నుండి తరలి వచ్చాం. అప్పటితో ఆ వ్యవహారం సమసిపోయిందనుకున్నాను. కాని అలా జరుగలేదు.

ఉద్యోగికి దూర భూమి లేదన్నట్లు ఊళ్ళు వెంట తిరగాల్సి వచ్చింది. ఇంటి దగ్గర వ్యవసాయం వగయిరా మా అమ్మ చూస్తుండేది.

మేము శ్రీకాకుళంలో ఉన్నప్పుడు ఒకసారి మా అమ్మ వచ్చింది. కాని పెద్ద డిగ్రీలు సంపాయించిన నా భార్య లోపల కాలు పెట్టనీయలేదు. నాలోని నర నరాలు పౌరుషంతో బిగుసుకున్నాయి. కాని మా అమ్మ నా చేయి పట్టుకొని ఇంటి బయటికి నడిచింది.

"చూడు రఘు! నా జీవితంలో చివరి మలుపులో ఉన్నాను. నా కారణంగ నీ కాపురంలో కలతలు రానీయవద్దు. నా కోడలుది మంచి హృదయం. కాని పట్టింపు గల మనిషి. కారణాలు ఏమయినప్పటికి నా పట్ల ఆమెకు ఏవగింపు కలిగింది. నేను కూడ కొంతవరకు కారణం కావచ్చు! నా వలన మీ కాపురంలో చిచ్చు రగులకూడదు..... పంతాలు, పట్టింపులకుపోతే చెడేది నీ కాపురం అనే విషయం మరువకు.... అప్పుడు సమాజం నిన్ను నవ్వులపాలు చేస్తుంది. అమ్మాయిని ఏదైనా అన్నావంటే, ఏదో ఒక అఘాయిత్యానికి పాల్పడవచ్చు! ఎన్నటికి తొందర పడకు.... వస్తాను బాబు!" అంటూ నా కళ్ళ వెంట కారుతున్న నీళ్ళు తుడిచి వెను తిరిగింది. నా మాతృమూర్తికి నా ఇంట్లో కనీసం ఒక గ్లాసెడు మంచి నీళ్ళు ఇవ్వలేకపోయాను.

తర్వాత అప్పుడప్పుడూ మా స్వగ్రామం వెళుతుండేవాడిని. మా అమ్మ ముఖంలో ఏ విధమైన అసంతృప్తి కానవచ్చేదికాదు. ప్రశాంతంగ ఉండేది. నే నెప్పుడయినా మా ఆవిడ ప్రవర్తించిన తీరు ప్రస్తావించినా, మా అమ్మ మాట మార్చి నా మనసులోని బాధను దూరం చేసేది.

సుమారు ఇరవై లక్షల రూపాయిల ఆస్తికి వారసుడ్ని. నాలుగు సంవత్సరాల నాడు ఆస్తి వివరాలు. బ్యాంక్ బ్యాలెన్స్ అన్నీ నా కప్పగించి,

"నువ్వు ఏడాది బిడ్డగ ఉన్నప్పుడు మీ నాయన కాలం చేశాడు. నా బాధ్యత చాతనయినంతవరకు తీర్చాను..... పెద్దదాన్నవుతున్నాను నాయనా! ఏ క్షణం ఎలా ఉంటుందో..... నాలుగు జిల్లాల దూరంలో ఉంటున్నావు..... అక్కడ దగ్గరలో ఏదైనా ఆశ్రమం ఉంటే చూడు!" అంది నిర్లిప్తంగ.

"నా భార్య కాదంటే, తనే వేరే ఇంట్లో ఉంటుంది. నువ్వు నాతో పాటే ఉండమ్మా!" అన్నాను నేను.

"అంతమాట అనవద్దు నాయనా! ఒక చెట్టు మోడు బారిందని, పుష్ప - ఫలములతో అలరారే మరొక పచ్చని చెట్టును నరకటానికి ప్రయత్నించకూడదు. ఈ మానసిక ఘర్షణలతో నీ మనసు పాడు చేసుకోవద్దు..... ఒక్కగా ఒక్క బిడ్డవు. నువ్వు పచ్చగా ఉండటమే నాకు కావలసింది. ఈ సూట్‌కేస్‌లో నా నగలన్ని భద్రపరచాను. అమ్మాయికి ఇవ్వు!" అంటూ ఒక వంద సవర్సుల బంగారం ఇచ్చింది.

ఆ రాత్రికే రాజమండ్రి చేరాను. తెల్లవార్లూ మా ఆవిడకు నగలు అలంకరించుకోవడంతోనే సరిపోయింది. లక్షా అరవై వేల రూపాయిల బ్యాలెన్సు కల బ్యాంక్ పాస్ బుక్ ఇచ్చాను. పొలం కౌలు కిచ్చామన్న విషయం, దానిపై ఏడాదికి ఇరవై వేలు ఆదాయం వస్తుందని చెప్పాను.... చివరగా మా అమ్మ పెద్దదయిందని, ఇక్కడకు తీసుకు వస్తానన్నాను.... అంతే వెళ్ళి ముసుగుతన్ని పడుకుంది.

మా అమ్మను బలవంతాన ఇక్కడ తెచ్చిపెడితే, నా భార్య ఎప్పుడు ఏ అఘాయిత్యానికి పాల్పడుతుందోనని భయపడ్డాను. ఏదైనా జరగరానిది జరిగితే..... అప్పుడు బాధపడి చేయగలిగిందేమి లేదు. పిల్లలు అనాథలౌతారు. సమాజం దృష్టిలో కూడ నేను దోషిని కాక తప్పదు...... అందుకే అన్ని ఘర్షణలను దిగమింగాను. చివరకు మా అమ్మను ఈ ఆశ్రమంలో తెచ్చిపెట్టాను.

మా అమ్మ చదువుకోలేదు. కాని చదువుకున్న నా భార్య మనసుని చదవగల్గిన శక్తి నా మాతృమూర్తికుంది. విద్యావంతురాలనుకుంటున్న నా భార్య మా అమ్మ హృదయం తెలుసుకోలేక పోయింది.... నా జనని జ్ఞాపకార్థం మా గ్రామంలో హైస్కూలు భవనానికి లక్ష రూపాయలు విరాళం ఇద్దామనుకుంటున్నాను.

ఇక వెళ్దామా, మాష్టారూ చాల పొద్దు పోయింది!" అన్నాడు రఘు.

ఇల్లు చేరేసరికి తెల్లవారుఝామయింది. స్నానం, సంధ్యావందనం, దేవతార్చన కానిచ్చాను.

వసారాలో కూర్చున్నాను. మంచు తెరలను ఛేదించుకుంటూ హిరణ్యగర్భుడు పైకి వస్తున్నాడు.

మానవుడు జీవితంలో ఎన్నో ఘర్షణలకు లోనవుతాడు. విభిన్న వ్యతిరేక పరిస్థితుల్లో కూడ ఎవ్వరినీ నొప్పించక, అన్ని బాధల్ని దిగమింగి ప్రశాంత జీవనం గడిపేవాడు మహర్షి. ఆ లక్షణాలన్ని అన్ని విధాల జీర్ణించుకున్న రఘు తప్పకుండ 'మహర్షి' అనిపించింది. □